ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కుమరం భీం

జిల్లా వార్తలు

8 బుధవారం 27 మార్చి 2024



వేసవి భత్యం అందేనా..?



- రెండేళ్లుగా ఉపాధిహామీ కూలీల నిరీక్షణ
- నూతన సాఫ్ట్‌వేర్‌లో లేని ఆప్షన్
- పని ప్రదేశాలలో సౌకర్యాలు కరువే
- ఎండలోనే పనులు చేస్తూ అవస్థలు

ఉపాధిహామీ పథకంలో పని చేసే కూలీలకు వేసవికాలంలో ప్రత్యేకంగా అమలు భత్యం విషయంలో ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గడిచిన రెండేళ్లుగా వేసవి భత్యం ఊసే లేకపోవడం, ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాకపోవడంతో అసలు భత్యం ఇచ్చేది ఉందా లేదా.. అనే సందిగ్ధం నెలకొంది. దీనికి తోడు ఉపాధిహామీ పనుల వద్ద సౌకర్యాల లేమితో కూలీలు అవస్థలు పడుతున్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 26: పేద కూలీలకు సొంత ఊరులోనే పని కల్పిస్తూ వలసలను నివారించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈజీ ఎస్ పథకంలో పంట పొలాలు చదును చేయడం, చెరువులు, కుంటలు, బావుల్లో పూడిక తీయడం, వ్యవ సాయ క్షేత్రాలకు దారులు వేయడం, హరితహారంలో మొక్కలు నాటడం, కంచెలు ఏర్పాటుచేయడం తదితర పనులు చేపడు తున్నారు. వ్యవసాయ పనులు పూర్తయ్యాక వేసవి కాలంలో ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి.

ప్రస్తుతం వేసవి కాలం కావడం, వ్యవసాయ పనులు పూర్తి కావడంతో జిల్లాలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. సాధారణంగా ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉపాధి పనులు జోరుగా కొన సాగుతుంటాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో వేసవి భత్యం అమలు చేసేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి, ఏప్రిల్‌లో 25 శాతం, మే నెలలో 30 శాతం అమలు చేస్తారు. అయితే ఈ ఏడాది మార్చి నెల పూర్తి కావస్తున్నా ఇంత వరకు వేసవి భత్యం ఊసేలేదు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఈజీఎస్‌కు సంబంధించి టీపీఎస్ సాఫ్ట్‌వేర్‌లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కొత్తగా తీసుకు వచ్చిన ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించి ఆప్షన్ లేదని సం బంధిత టెక్నికల్ సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఈ ఏడాదైన వేసవి భత్యం అమలవుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో 93 వేల కార్డులు..

జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల పరిధిలో 93 వేల జాబ్ కార్డులు ఉన్నాయి. 1,73,000 మంది కూలీలు ఉన్నారు. ఒక్కొక్క కూలీకి 170 నుంచి 200 రూపాయల వరకు చెల్లిస్తున్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో సరైన సౌకర్యాలు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ పనులు జోరందుకున్నాయి. రోజురోజుకు కూలీల సంఖ్య పెరుగుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఉపాధి పనులు చేపట్టే ప్రదేశంలో నీడ, తాగునీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండాలి. ఈ సౌకర్యాల గురించి సమా వేశాల్లో చెప్పడమే తప్ప ఆచరణలో కని పించడంలేదు. మండుటెండ లోనే కూలీలు పనులు చేస్తూ అస్వస్థతకు గురవుతున్నారు. పని ప్రదే శంలో తాగునీటి వసతి కల్పించని పక్షంలో భత్యం అదనంగా 5 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

రెండేళ్లుగా భత్యం ఇవ్వడం లేదు..: పురుషోత్తం, ఉపాధి కూలీ



ప్రతి ఏడాది ఎండకాలంలో పనిచేస్తే అదనపు కూలీ ఇచ్చేవారు. రెండేళ్లుగా ఇవ్వడంలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదంటున్నారు. ఎండాకాలం భత్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలి. ఉపాధిహామీ పనులు చేసే చోట సౌకర్యాలు లేవు. నీడ, తాగు నీరు, వసతి లేదు. ఎండలో పని చేయడం కష్టంగా ఉంది. అధికారులు కూలీలు అవస్థలు పడకుండా చర్యలు తీసుకోవాలి.

గుడుంబా పట్టివేత

చింతలమానేపల్లి, మార్చి 26: చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్-1 గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నామని ఎస్సై నరేష్ తెలిపారు. గ్రామానికి చెందిన సర్కార్ బరితోష్ కిరాణంలో ఐదు లీటర్ల గుడుంబా లభించిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

లింగాపూర్, మార్చి 26: మండలంలోని జాముల్‌ధర గ్రామ సమీపంలో మంగళవారం బైక్ అదుపుతప్పి కింద పడిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జాముల్‌ధర గ్రామానికి చెందిన పూర్కు విశ్వనాథ్(35) అనే యువకుడు తన గ్రామంలో స్నేహితులతో కలిసి హోలీ ఆడుకున్నాడు. అనంతరం తన ద్విచక్ర వాహనంపై లింగాపూర్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో గల బ్రిడ్జిని వాహనం అదుపుతప్పి ఢీకొట్టింది. కిందపడిన విశ్వనాథ్ ఛాతిపై బలమైన గాయమైంది. అటుగా వెళ్తున్న వారు గమనించి జైనూర్ ఆస్పత్రికి తరలించారు. విశ్వనాథ్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాసిరకం పనులపై చర్యలు తీసుకోవాలి

సిర్పూర్(టి), మార్చి 26: మండలంలోని అచ్చెల్లి గ్రామంలో 2018-19లో చేపట్టిన శ్మశాన వాటిక, డంపింగ్ యార్డు పనులు నాసిరకంగా చేపట్టారని, వాటిపై చర్యలు తీసుకోవాలని పేదరిక నిర్మూలన సంస్థ అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ మంగళవారం ఎంపీడీవో కార్యాల యంలో వినతి పత్రం అందజేశారు. ఉపాధిహామీ నిధులతో పనులు నాసిరకంగా జరిగాయని, వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యకర్తల సమావేశం

దహెగాం, మార్చి 26: దహెగాం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ దండె విఠల్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ప్రశాంత్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార నిర్వహణపై అవగాహన

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 26: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వ్యాపార నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిర్పూర్ పేపర్ మిల్లు, భారతీయ యువశక్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల వివిధ వ్యాపారాలు ప్రారంభించి రాణిస్తున్న యువతకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఉపయోగాపడుతాయన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కునాల్, శంకర్, లెక్చరర్లు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

- డీఎఫ్‌వోకు బంబార, పాటగూడ గ్రామస్థుల వినతి

వాంకిడి, మార్చి 26: వాంకిడి మండలంలోని బంబార, గోండుకోసార గ్రామాల మధ్య వాగుపై వంతెన నిర్మాణానికి అటవీ శాఖ ద్వారా అనుమతులు ఇవ్వాలని కోరుతూ మంగళవారం బంబార, పాటగూడ గ్రామస్థులు మాజీ సర్పంచ్ సయ్యద్ అయాబ్, కోట్నాక కిష్టుల ఆధ్వర్యంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా గోండుకోసార గ్రామానికి మట్టి రోడ్డుపైనే రాక పోకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి వర్షాకాలం గ్రామాల మధ్య వాగు వరద ప్రభావం వల్ల రాక పోకలకు తీవ్ర అంతరాయంఏర్పడుతుందని, ఇటీవల గోండ్‌కోసార గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి నాలుగు కోట్లు, వంతెన నిర్మాణానికి కోటిన్నర మంజూరైందన్నారు. పనులు ప్రారంభించినప్పుడు అటవీ అధికారులు పనులు నిలిపి వేశారని, వంతెన పూర్తయితే నాలుగు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయని వివరించారు.

ఎన్నికల యాప్‌లను వినియోగించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం నిర్వహించే యాప్‌లను రాజకీయ పార్టీలు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెకర్లు దీపక్ తివారి(స్థానిక సంస్థలు), దాసరి వేణు(రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణ కోసం రూపొందించిన ప్రతి ఎన్నికల యాప్‌లను సువవిధ, సి-విజిల్, 1950లను ఉపయోగిం చుకోవాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో అభ్యంతరాలు, నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదులు, ఇతర ఎన్నికల సంబంధిత సమస్యలపై యాప్‌లలో, కంట్రోల్ రూంలలో సంప్రదిచవచ్చని తెలిపారు. ప్రచార సంబంధిత అనుమతుల జారీ కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన వీడియో సెంటర్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీలలో సంప్రదించవచ్చన్నారు. ప్రింట్ మీడియాలలో పెయిడ్ న్యూస్ వార్తల పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రత్యేకంగా కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని చెప్పారు. ఫిర్యాదు ఉంటే 08733-279033 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాకు సంబంధించి త్వరలో ప్రచార సంబంధిత అంశాల ఛార్జిల చార్ట్ రూపొంది స్తామన్నారు. జిల్లాకు త్వరలో వ్యయ పరిశీలకులు, సాధారణ పరిశీలకులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీన ఉదయం 11 గంటలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రాండమైజేషన్ ఉంటుందని చెప్పారు. జిల్లాలో అంతర్ రాష్ట్రం సరిహద్దు గ్రామాలైన కెరమెరి మండలంలోని 12 గ్రామాలలో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ విషయమై విస్తృతప్రచారం చేపట్టాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హుక్కును వినియోగించుకునేలా ప్రజలలో చైతన్యం తీసుకు రావాలన్నారు. నూతన ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 1, 2024 తేదీ ప్రామాణికంగా ఏప్రిల్ 15వ తేదీ వరకు ఫారం 6 ద్వారా నూతన ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపునకు దరఖాస్తులు స్వీకరించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

● మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్రట్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సిర్పూర్,ఆసిఫాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు దీపక్ తివారి, దాసరి వేణులతో కలిసి జిల్లాలో రెవెన్యూ అధికారి లోకేశ్వరరావు, నోడల్ అధికారి అశోక్, తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్‌పాండేలతో కలిసి రాండమైజేషన్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ర్యాండమూజేషన్‌లో సిబ్బందికి కేటాయించిన మొదటి దశలో 3,973 మందిని ర్యాండమైజేషన్ చేయనున్నామని తెలిపారు. ఉద్యోగులకు ఎస్ఎంఎస్‌తో పాటు సంబంధిత ప్రతిని అందించడం జరుగుతుందని ఉద్యోగులు తమ కేటాయంచిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ అందిస్తామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఫారాలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఉద్యోగులకు కేటా యించిన విధులలో సవరణల కోసం ఎన్నికల అధికారికి దరఖాస్తు రూపంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈ-డిస్ట్రిక్ మేనేజర్ గౌతంరాజు, నేషనల్ ఇన్ఫర్మేషన్ సిబ్బంది డి.శ్రీకాంత్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పిస్తున్నాం



సిర్పూర్(యు)లో మాట్లాడుతున్న డీఎస్పీ సదయ్య

సిర్పూర్(యు), మార్చి 26: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వారిలో భరోసా కల్పించడానికి పోలీసు కవాతు నిర్వహిస్తున్నామని డీఎస్పీ సదయ్య అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఇందులో సిఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాకేష్ కుమార్, 50 మంది సీఆర్పీఎఫ్ కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఎక్కడైనా సమస్యాత్మక ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ అంజయ్య, ఎస్సై మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

దహెగాం, మార్చి 26: అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు మావోయిస్టులకు సహకరించవద్దని కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు అన్నారు. మండలంలోని లోహ గ్రామంలో ప్రజలతో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన విషయంపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మావోయిస్టులకు సహకరించవద్దని, వారితో గ్రామాలు అభివృద్ధి చెందవని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు వస్తే తమకు సమాచారం అందించాలని చెప్పారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడద్దన్నారు. అంతకు ముందు గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తిలో అంతర పంటలను వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శివకృష్ణ

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 26: పత్తి సాగులో అంతర పంటలను వేయాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శివకృష్ణ, నాగరాజు అన్నారు. మండలంలోని దాంపూర్ గ్రామంలో మంగళవారం నాబార్డు ఆర్థిక సహాయంతో వాసన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రైతులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు ఎక్కువ పత్తిని పండిస్తున్నారని చెప్పారు. పత్తిలో అంతర పంటలుగా కంది, పెసర, మినుములు తదితర పంటలను వేయడం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చన్నారు. పత్తిపంట తర్వాత చిరుధాన్యాలు వేసి లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వాసన్ ప్రతినిధి జయవర్ధనే తదితరులు పాల్గొన్నారు.

పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- డీఎస్పీ కరుణాకర్‌కు గ్రామస్థుల వినతి



కాగజ్‌నగర్ డీఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న గ్రామస్థులు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 26: తన భూమిలోకి అక్రమంగా చొరబడి పంటను, పొలంలోని సోలార్ తీగ ఇతరత్ర పరికరాలను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌కు మంగళవారం గ్రామస్థులు, బీజేపి నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. దహెగాం మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన సందెల మురళీ, తల్లి లక్ష్మితో కలిసి కాగజ్‌నగర్ డీఎస్పీకి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇట్యాల గ్రామ శివారులో దశాబ్ద కాలానికి పైగా కబ్జాలో ఉన్న భూమిలో పంటు వేసుకుని జీవిస్తున్నామని చెప్పారు. కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామ పంచాయతీలోని పర్ధాన్ గూడకు చెందిన గెడం రేఖాబాయి, గెడం పెంటుబాయి, గెడం బాబు, ఆత్రం కమల, ఆత్రం అన్నాజీ ఇట్యాలకు చెందిన కొంత మంది ప్రోద్బలంతో తమకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. సోమవారం పంట చేనులోకి చొరబడి చంపుతామంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని దహెగాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో డీ ఎస్పీని కలిసి విన్నవించినట్లు తెలిపారు.తమకు న్యాయం చేయాలని కోరగా డిఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. ఫిర్యాదు అందించిన వారిలో గ్రామస్థులు సంతోష్, శంకర్, రామయ్య, మల్లేష్, బీజేపి నాయకులు పాల్వాయి సుదాకర్ రావు, కొంగ సత్యానారాయణ, సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్ రావు, దోని శ్రీశైలం, డెబ్బటి శ్రీనివాస్, వీరభద్రాచారి, భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ శివాగౌడ్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీఎంవో ఉద్ధవ్

బెజ్జూరు, మార్చి 26: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. బెజ్జూరు, సోమిని, సలుగుపల్లి ప్రభుత్వ ఆశ్రమ గిరిజన పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకునే సమయం పదో తరగతి అన్నారు. లక్ష్యాలను అధిగమించేందుకు విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదుకోవాలన్నారు. బట్టీ చదువులు కాకుండా ఇష్ట పడి చదవాలని సూచించారు. ఆయన వెంట డీఆర్పీ వామన్ తదితరులు ఉన్నారు.

సింగరేణి సమాచారం

వెద్య సిబ్బందిని నియమించాలి

- బీఎంఎస్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి

శ్రీరాంపూర్, మార్చి 26: శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి డిస్పెన్సరీలలో తగినంత మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులు, కార్మిక కుటుంబాలకు సరిపోయినంత మంది వైద్యులు, సిబ్బంది లేరని తెలిపారు. స్పెషలిస్టు డాక్టర్లు లేక కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో నేడు ఎక్కువ మంది యువ కార్మికులు పనిచేస్తున్నారని, వారి కుటుంబాలకు గైనకాలజిస్టులు, పిల్లల వైద్యులు అవసరమని తెలిపారు. కాగా తగిన వైద్య సేవలు అందకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్, అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులను నియమించాలని ఆయన కోరారు.

ప్రమాదాలకు బాధ్యులను చేయొద్దు

శ్రీరాంపూర్, మార్చి 26 : సింగరేణి గనులు, విభాగాల్లో ఉద్యోగులకు జరుగుతున్న ప్రతి ప్రమాదానికి అధికారులను బాధ్యులను చేయడం సరికాదని అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కే వెంకటేశ్వర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు డీజీఎంఎస్ అధికారులతో విచారణ చేయించి బాధ్యులపై తగిన చర్యలు తీసు కుంటామని పేర్కొన్నారు. అధికారులను మాత్రమే బాధ్యు లను చేయడంతో మనోస్థైర్యాన్ని కోల్పోతున్నారని తెలిపారు. ప్రమాదాలపై ఏదైనా అనుమానాలు ఉంటే గని అధికారికి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల సంరక్షణకు అంతర్గత ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఏరియా రక్షణాధికారి రవీందర్

మందమర్రి టౌన్, మార్చి 26: గనిలో పని చేస్తున్నప్పుడు రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, విధులు నిర్వహించేటప్పుడు తప్పకుండా రక్షణ సూత్రాలను పాటిస్తూ పనులు చేయాలని మందమర్రి ఏరియా రక్షణాధికారి రవీందర్ తెలిపారు. ఏరియాలోని కేకే 5 గనిపై మంగళవారం రక్షణపై కార్మికులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ మధ్య కాలంలో అప్రమత్తంగా లేకపోవడం వల్ల కార్మికులు ప్రమాదాల భారిన పడి అవయవాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుడి ప్రాణాలు వారి కుటుంబానికి ఎంత ముఖ్యమో సంస్థకు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. రక్షణతో పని చేయడం వల్ల ఎలాంటి ప్రమాదాలు సంభవించవని తెలిపారు. విధి నిర్వహణలో తొందరపాటు నిర్ణయాలు సరికావని తెలిపారు. బొగ్గు సరఫరా చేసే హాలర్ డ్రైవర్ నుంచి మొదలు రూఫ్‌లెసన్‌ు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ప్రతి రోజు రూఫ్ పరిశీలించేటప్పుడు హాలర్ డ్రైవర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. పని పూర్తయిన తర్వాతే హాలర్ డ్రైవర్ టబ్బులను పైకి తీసుకెళ్లాలని, మధ్యలో ట్రామర్లకు సమాచారం అందించాలన్నారు. ప్రతీ ఉద్యోగి ఇలాంటి ప్రమాదాలను నివారించడానికి లోటో విధానాన్ని తప్పక పాటించాలన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. కార్మికుడు ఆరోగ్యంగా ఉంటేనే కంపెనీ ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా ఉత్పత్తి, ఉత్పాదకత సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, వర్కుమెన్ ఇన్స్పెక్టర్ తాళ్లపెల్లి సారయ్య, ఓవర్‌మెన్‌లు, మైనింగ్ సర్దార్‌లు, కార్మికులు ఉన్నారు. అనంతరం గనిలో ఇంటర్నల్ హాలేజి సేఫ్టీ బృందం తనిఖీ నిర్వహించింది.

కనీస వేతనాలు చెల్లించాలి

- కార్మికశాఖ డైరెక్టర్‌కు ఏఐటీయూసీ నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 26: ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చే కనీస వేతనాలను పెంచాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం హైదరాబాద్‌లో కార్మికశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గత 16 ఏళ్ల నుంచి వేతనాలు పెంచకపోవడం వల్ల అనేక రంగాలతో పాటు సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నష్టాన్ని పూడ్చేందుకు వేతన సవరణ చేపట్టాలన్నారు. అలాగే జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని యాజమాన్యాలకు ఎన్నిసార్లు విన్నవించినా వారి నుంచి స్పందన కరువైందన్నారు. జీవో 22ను గెజిట్ చేసి వేతనాలు అమలు చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా ఇంతవరకు అమలు కాలేదన్నారు. కార్మి క శాఖ అధికారులు స్పందించి అమలయ్యేలా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, గోదావరిఖని రీజియన్ నాయకుడు ఎస్‌కె గౌస్, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వరుడి డోలోత్సవం

ధర్మపురి, మార్చి 26: ధర్మపురి శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య మధ్యాహ్నం ఉత్సవమూర్తిని సేవలపై ఆశీనులు చేశారు. అనంతరం పురవీధుల గుండా బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)కు తీసుకువచ్చారు. బ్రహ్మ పుష్కరిణిలో హంస వాహనపైన ఉంచిన స్వామి వారల సేవలను ఐదు సార్లు ప్రదక్షిణలు చేయించి అర్చకులు తెప్పోత్సవం నిర్వహించారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సిర్పూర్(టి), మార్చి 26: మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై సీఐ సాధిక్ పాషా ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రూ.50 వేల కంటే అధికంగా నగదు ఉన్నట్లయితే రశీదు ఉండాలని చెప్పారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సామగ్రి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట ఎస్సై దీకొండ రమేశ్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

లింగాపూర్: మండలంలోని పిట్టగూడ సమీపంలో సిబ్బందితో కలిసి ఎస్సై ప్రవీణ్‌కుమార్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్య లు తీసుకుంటామని చెప్పారు.

ఎస్పీని కలిసిన ఆర్టీసీ డీఎం

ఆసిఫాబాద్, మార్చి 26: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన విశ్వనాథ్ మంగళవారం జిల్లా ఎస్పీ సురేష్‌కు మార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. అనంతరం ప్రయాణికులకు అందిస్తున్న సేవలు, మ హాలక్ష్మి పథకం తదితర అంశాలపై చర్చించారు. బస్టాండు ఆవరణలో శాంతి భద్రతల, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించాలని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల అనంతరం కాని స్టేబుళ్లను నియమిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని డీఎం తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని

ఇంటి నుంచి పారిపోయిన చిన్నారులు

● స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం

నెన్నెల, మార్చి 26: కుశ్నపల్లి గ్రామానికి చెందిన ఒల్లాల గణేష్‌గౌడ్-వసంతలకు తొమ్మిదేళ్ల వైష్ణవి, ఏడేళ్ల శంకర్‌గౌడ్ ఉన్నారు. శంకర్‌గౌడ్ చేనుకు వెళ్లి వచ్చే సరికి సెల్‌ఫోన్ పగిలిపోయి ఉంది. ఫోన్ ఎలా పాడైందని, ఎవరు పగుల గొట్టారని తండ్రి పిల్లలను మందలించాడు. తండ్రి కోప్పడడంతో చిన్నారులు ఇంటి నుంచి పారిపోవాలని నిశ్చయించుకున్నారు. తల్లిదండ్రులకు చెప్పాపెట్టకుండా ఇంట్లో నుంచి బయలుదేరారు. రెబ్బెన మీదుగా 11 కిలోమీటర్ల దూరంలోని నెన్నెలకు కాలినడకన చేరుకున్నారు. బెల్లంపల్లి వైపు నడిచి వెళ్తున్న చిన్నారులను సెర్ప్ ఉద్యోగి దుర్గం మల్లేష్‌కు అగుపించారు. అతడికి అనుమానం వచ్చి ప్రశ్నించగా తండ్రి కొట్టడంతో ఇంటి నుంచి పారిపోయి వచ్చినట్టు తెలిపారు. వారిని సముదాయించి సమీపంలోని కస్తూర్బా హాస్టల్లో కూర్చోబెట్టాడు. నెన్నెల పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వివరాలు సేకరించారు. తండ్రి గణేష్‌గౌడ్‌కు ఫోన్ చేసి పిలిపించారు. కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను తండ్రికి అప్పగించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 26 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్ళుగా రూ.5,600 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండడంతో కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్‌లు ఇవ్వక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అజయ్, శ్రీను, సాయి, అభి తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు బీట్ ఆఫీసర్లకు శిక్షణ



ఏసీసీ, మార్చి 26: తెలంగాణ ఫారెస్టు అకాడమీ 34వ బ్యాచ్ ఫారెస్టు బీట్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాలులో నిర్వహించారు. హైద్రాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ, సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రామిండ్ల తిరుపతి రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. బీట్ అధికారులకు వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972, తెలంగాణ ఫారెస్టు యాక్టు 1967, తదితర చట్టాలకు సంబంధించి అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు. అడ్వకేట్ నటేశ్వర్, ఎఫ్ఆర్‌వో, ట్రైనింగ్ ఇన్‌చార్జి అధికారి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మూడోసారి మోదీనే ప్రధాని



లక్షెట్టిపేటలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మందమర్రిటౌన్, మార్చి 26: కేంద్రంలో మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌లు అన్నారు. మంగళవారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీలో ఉన్నంత సేపు కేసీఆర్‌ది కుటుంబపాలన అని విమర్శించిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిది కుటుంబ పాలన కాదా అని విమర్శించారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ మొండి చేయి చూపిస్తూ డబ్బులు ఇచ్చిన వారికి టికెట్లు ఇస్తుందన్నారు. 60 ఏండ్లలో పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధి జరగలేదన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో ప్రజల సంక్షేమం సాధ్యం కావాలంటే బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో దుకాణ సముదాయాలు తిరుగుతూ బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. దుర్గం అశోక్, డీవీ దీక్షితులు, కుమారస్వామి, మేకల రమేష్, రొడ్డ మోహన్, వెంకటేశ్వర్‌గౌడ్, దుర్గరాజ్, కొంతం రాజు, తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటరూరల్: ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. లక్షెట్టిపేటలోని బస్టాండ్ నుంచి ఉత్కూరు చౌరస్తా వరకు బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. రఘునాథ్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ప్రజల సంక్షేమం సాధ్యం కావాలంటే బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. హరిగోపాల్, ప్రభాకర్, రమేష్ జైన్, నరేష్‌జైన్ పాల్గొన్నారు.

దండేపల్లి: అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే కేంద్రంలో మళ్లీ నరేంద్రమోదీ ప్రభుత్వంతోనే సాధ్యమని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి



మందమర్రిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ అభ్యర్థి

రఘునాథ్ ఆధ్వర్యంలో గూడెంలో మాజీ జడ్పీటీసీ భోజనాయక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వల్లంభట్ల శ్రీనివాస్, తిరుపతి, రమేష్, రాజయ్య తదితరులు ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ సమక్ష్యంలో బీజేపీలో చేరారు. గోమాస శ్రీనివాస్ మాట్లాడుతూ 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అంతా అవినీతిమయంగా కొనసాగిందన్నారు. పదేళ్ల బీజేపీ పాలన మచ్చ లేకుండా దేశ ప్రజలకు మోదీ మంచి పాలన అందించాడన్నారు.

గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో గోమాస శ్రీనివాస్ పూజలు చేశారు. ఎంపీగా గెలిపించాలని సత్యదేవున్ని వేడుకున్నారు. గూడెంలో పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు.

వైభవంగా ఆభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



దేవాలయంలో పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పండితులు

భీమిని, మార్చి 26: మల్లీడి గ్రామంలో నిర్మించిన వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారం కన్నుల పండుగగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ జలాధివాసం, నవగ్రహ హోమం, మండప హోమాలు నిర్వహించారు. ముందుగా అభయాంజనేయ స్వామి, శివపంచాయతన, నవగ్రహ విగ్రహాలను ఊరేగించారు.

అనంతరం యంత్ర ప్రతిష్ఠ, దేవ తామూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి అన్నదాన కార్య క్రమాలు నిర్వహించారు. బుధవారం యంత్ర ప్రతిష్ఠ, శాంతి పౌష్టిక హోమాలు, బలి ప్రదానం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తా రని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాలు తాండూరు మం డలం అచ్చలాపూర్ వేదపాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు దుద్దిళ్ల మనోహర అవధాని, ముద్దు ధీరజ్ శర్మ, శివ శర్మ, దినేష్ శర్మలు లు ప్రతిష్ఠా క్రతువును నిర్వహించారు.

గంజాయి పట్టివేత

మందమర్రిటౌన్, మార్చి 26 : పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన వివేక్‌రాజ్ మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నాడని తెలిపారు. పక్కా సమాచారం మేరకు నిందితున్ని పట్టుకుని 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నగదు స్వాధీనం

కాసిపేట, మార్చి 26 : సోమగూడెం చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1,05,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గోలేటి నుంచి మంచిర్యాలకు వెళ్తున్న అప్పం మల్లేష్‌ను తనిఖీ చేయగా రూ. 54,700, రవీంద్రనగర్ నుంచి వస్తున్న మచ్చర్ల రాకేష్‌ను తనిఖీ చేయగా రూ. 51 వేల నగదు దొరికిందన్నారు. నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

మామిడితోటను తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



కాలిపోయిన తోటలో యజమాని వెంకటి

మందమర్రిటౌన్, మార్చి 26 : పట్టణానికి చెందిన ఏల్పుల వెంకటికి మండలంలోని మామిడిగట్టులో ఉన్న మామిడి తోటను మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారు. విషయం తెలుసుకున్న బంధువులు వెంకటికి సమాచారం అందించారు. వెంకటి వెళ్లే సరికి తోటలోని 100 మామిడి చెట్లకు ఉన్న మామిడి కాయలు కాలిపోయాయి. కాయలు చేతికి వచ్చే సమయంలో తోట కాలిపోవడంతో వెంకటి కన్నీరు మున్నీరయ్యాడు. రాత్రనక, పగలనక కష్టపడి మామిడితోటను పెంచుకుంటే ఆఖరి దశలో తోటను కాల్చివేయడంతో తీవ్రంగా నష్టపోయాయని తనను ఆదుకోవాలని కోరాడు.

ఆలయాల హుండీల లెక్కింపు



గూడెం, చెన్నూరు ఆలయాల హుండీల లెక్కింపు

దండేపల్లి, మార్చి 26 : గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో 80 రోజులకు సంబంధించిన హుండీలు మంగళవారం లెక్కించారు. రూ. 6,23,103 ఆదాయం వచ్చినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. దేవాదాయ ధర్మదాయశాఖ పర్యవేక్షణాధికారి బి. రమేష్, ఆలయ ముఖ్య అర్చకులు గోవర్దన రఘుస్వామి, వేదపండితులు దుద్దిళ్ల నారాయణశర్మ, సత్యనారాయణస్వామి సేవా సమితి సభ్యులు, అర్చకులు, పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరులోని మదన పోచమ్మ ఆలయం హుండీని మంగళవారం ఆలయ ఈవో ముక్త రవి ఆధ్వర్యంలో లెక్కించారు. రూ. 2,80,112 నగదు, 2 గ్రాముల 500 మిల్లీ గ్రాముల మిశ్రమ బంగారం, 82 గ్రాముల 700 మిల్లీ గ్రాముల మిశ్రమ వెండి వచ్చిందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

- వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ఆసిఫాబాద్, మార్చి 26: రైతుల నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లు, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖాధికారులతో వరి ధాన్యం కొనుగోలు, తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుం టుందని చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యార్థం తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని తెలిపా రు. ప్రజలకు ఎలాంటి నీటి ఎద్దడి సమస్య లేకుండా తాగునీటిని సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో పౌర సరఫరాల శాఖ, ఐకేపీ ఆధ్వర్యంలో 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుం టుంద న్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నీడ కోసం షామియానాలు, తాగునీరు సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. అవసరమైన టార్పా న్లను అందుబాటులోఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలి పారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద వ్యవవసాయ శాఖ, వ్యవసాయ విస్తరణ అధికారులతో పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో రెండు మున్సిపాలిటీలు, 334 గ్రామ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

పంచాయతీల్లో తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖాధికారి సురేందర్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి తారమణి, నర్సింగరావు, డీపీవో భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

పూర్తయిన భవనం

- 4న రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్ఠాపన
- ఏర్పాట్లు చేస్తున్న గ్రామస్థులు



కర్జెల్లి గ్రామంలో నిర్మించిన ఓంకార ఆశ్రమం

చింతలమానేపల్లి, మార్చి 26: చింతలమానేపల్లి మండలం కర్జెల్లి గ్రామంలో నిర్మించిన ఓంకార ఆశ్రమం పనులు పూర్తయ్యాయి. కర్జెల్లి గ్రామ స్థులతో పాటు చింతమానేపల్లి, బాలాజీ అనుకోడ, రుద్రాపూర్, బారెగూడ, రుద్రాపూర్, ముంజంపల్లి, గంగాపూర్ తదితర గ్రామాల భక్త బృందం సభ్యులు తమ పనులను సైతం పక్కన పెట్టి నిర్మాణం పూర్తికి నడుంకట్టారు. దీంతో చుట్టు పక్కల సమీప గ్రామాల్లో ఆధ్యాత్మికత వెల్లువెరియనుంది. ఏప్రిల్ 4న రాధా కృష్ణుల విగ్రహమూర్తుల ప్రతిష్ఠాపన కోసం చకాచకా పనులు కొనసాగుతున్నాయి. ఏటా వివిధ కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం, యాగాలు, ప్రత్యేక పూజలు, ప్రవచనాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- పండుగ రోజుల్లో..

ఆశ్రమంలో ఏటా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, మహాశివరాత్రి, ఉగాది, హనుమాన్ జయంతి, గీతా జయంతి, వైకుంఠ ఏకాదశి, గురు పౌర్ణమి, వంటి కార్యక్రమాలతో పాటు ప్రత్యేక రోజుల్లో యాగాలు, యజ్ఞాలు, హోమాలు, వక్తలచే ప్రవచనాలు, సంకీర్తనల కార్యక్రమం నిర్వహిస్తారు. శ్రీవిష్ణు సేవా నందగిరి స్వామి, శ్రీనారాయనానందగిరి స్వామి, తదితరులు భక్తులకు ప్రవచనాలు బోధిస్తూ యువతలో, ఆయా గ్రామాల భక్తుల్లో మరింత భక్తి పెంపొం దించేందుకు చర్యలు చేపడుతున్నారు. దీంతో గ్రామాల్లో ఆధ్యా త్మికత వైపు యువత ఆకర్షితులవు తున్నారు.

- మూడు ఎకరాల భూమి..

ఇక్కడ ఆశ్రమ ఏర్పాటు చేయడానికి 2007లోనే మూడు ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. కరీంనగర్ జిల్లా గాగిల్లాపూర్ ఆశ్రమానికి చెందిన గురువు శ్రీదయానందగిరి స్వామి శిష్యులు శ్రీ ప్రేమ స్వరూపానందగిరి స్వామి, విష్ణుసేవానందగిరి స్వామి, బృందావనం శివన్న స్వామి కర్జెల్లి గ్రామంలో భక్తిభావానికి మె చ్చుకొని ఆశ్రమ ఏర్పాటుకు అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. స్థానికంగా దయానందగిరి స్వామికి శిష్యులు ఉండడంతో ఆశ్రమం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అనంతరం ఇక్కడి భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో ఆశ్రమం అభివృద్ధి చేశా రు. 2022లో దాతల సహకారంతో సుమరుగా 50 లక్షల వ్యయంతో ఆశ్రమం నిర్మాణం పూర్తి చేశారు. విద్యుత్, మంచి నీరు, రహదారి, వం టివి భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు.



సిద్ధం చేసిన రాధాకృష్ణుల విగ్రహాలు

దాతల చేయూత..

ఆశ్రమాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నాం. ఇక్కడ నిర్వహించే కార్యక్రమాల్లో అందరు భాగస్వాములవుతున్నారు. భక్తులు తమ ఆలోచనలు పంచుకొని ఆశ్రమానికి చేయూత నిస్తున్నారు. యువతలో సైతం భక్తి భావాలు పెరుగుతున్నాయి. 4న రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- డుబ్బుల శేఖర్, బాలాజీఅనకోడ

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళన



గ్రిడ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

ఆసిఫాబాద్, మార్చి 26: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గ్రిడ్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి నెలా వేతనాలు చెల్లిచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అర్హులైన కార్మికులకు ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకుడు లోకేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి), మార్చి 26: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. సిర్పూర్(టి) మండలం దోర్పల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలతో ఉదయమే పనులు చేయించాలన్నారు. ఈజీఎస్ నర్సరీలో మొక్కలను పరిశీలించి సంరక్షణకు నీటిని పోయాలని సూచించారు. గ్రామంలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా నీరు అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైన సమస్యలు ఉంటే పరిష్కరించాలని కార్యదర్శి ఫహిమా బానును ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
బుధవారం 27 మార్చి 2024





సజావుగా పదో తరగతి పరీక్ష

ఏసీసీ, మార్చి 26: పదో తరగతి పరీక్ష మంగళవారం జిల్లా వ్యాప్తంగా సజావుగా జరిగింది. భౌతిక, రసాయన శాస్త్ర పరీక్షకుగాను 52 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 9298 మందికి 9276 మంది హాజరయ్యారు. బ్యాక్‌లాగ్ విద్యార్థులు 144 మందికి 128 మంది హాజరయ్యారు. డీఈవో యాదయ్య 3 పరీక్ష కేంద్రాలను, అసిస్టెంట్ కమిషనర్ 1, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 14 కేంద్రాలను సందర్శించారు.



భానుడి భగ భగ

- పగటిపూట తీవ్రమవుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు
- కూలర్లు, ఏసీలకు పెరిగిన డిమాండ్

మంచిర్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూర్య ప్రతాపం గరిష్ఠ స్థాయికి చేరుకుంటోంది. వారం రోజులుగా విపరీతమైన ఎండలతో ప్రజలు సతమతమవుతున్నారు. పగటి పూట బయటకు వెళ్లాలంటేనే ఆందోళనకు గురవుతున్నారు. నాలుగైదు రోజులుగా జిల్లాలో సగటు ఉష్ణోగ్ర తలు 40 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఉదయం కాస్త చల్లగా ఉంటున్న వాతావరణం మధ్యాహ్నం విపరీతంగా వేడెక్కుతోంది. రాత్రి 8 గంటల వరకు ఎండ వేడి తగ్గడం లేదు. ఉదయం 10 గంటలకే ఎండ వేడి పెరగడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

తీవ్రమవుతున్న ఉష్ణోగ్రతలు...

జిల్లాలో వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి నెలలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండడం ఆందోళనకు రేకెత్తిస్తోంది. జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి ఏరియాల్లో అండర్ గ్రౌండ్ బొగ్గు బావులతోపాటు ఓపెన్‌కాస్టు మైన్‌లు ఉండడంతో ఇక్కడి వేడి ఎక్కువగా ఉంటోంది.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి...

అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలపై బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పగటి పూట ఏసీలు ఉపయోగిస్తే కాని ఇళ్లలో ఉండే పరిస్థితి లేదు. కూలర్‌లలోనూ వేడిగాలులు వస్తున్నాయి. మార్చిలోనే ఎండ తీవ్రత ఇలా ఉంటే రాబోయే రోజుల్లో పరిస్థితి పట్ల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గడిచిన మూడు రోజుల్లో ఉష్ణోగ్రత వివరాలు..

జిల్లాలో గడిచిన మూడు రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 24వ తేదీన జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.4 డిగ్రీలు నమోదయ్యాయి. 25న 38.8 డిగ్రీలు, 26న 39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా మంగళవారం కాసిపేట మండలం కొండాపూర్‌లో గరిష్ఠంగా 39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, అత్యల్పంగా తాండూరు మండలంలో 37.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కాసిపేట: రెండు రోజుల నుంచి జిల్లాలో ఎండ తీవ్రత విపరీతంగా పెరిగిపోయింది. జిల్లా వ్యాప్తంగా బొగ్గు గనులు విస్తరించి ఉండడంతో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలున్నాయని హైద్రాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. జిల్లాలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూను తల పిస్తున్నాయి. వేసవి ఆరంభంలోనే ఎండలు అదిరి పోతుంటే రానున్న రెండు నెలలను తలుచుకుని జనం బెంబేలెత్తిపోతున్నారు. ఎండ వేడి బారిన ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

కూలర్లు, ఏసీలకు పెరిగిన డిమాండ్

ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. ఎండ తీవ్రతకు తాళలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతు న్నారు. దీంతో మార్కెట్‌లోకి వచ్చిన ఏసీ, కూలర్లు, ఫ్యాన్‌లకు, ఫ్రిజ్‌లకు డిమాండ్ పెరిగిపోయింది. వినియోగదారులను ఆకర్షించేందుకు ఫ్యాన్‌లు, కూలర్లను ఆకర్షణీయ మోడళ్లలో తయారు చేసి విక్రయిస్తున్నారు. ఒక్కరే వాడుకునేందుకు సింగిల్ ఎయిర్ కూలర్లు సైతం మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు పండ్లరసాలు, కొబ్బరిబొండాలు ఎంతో ఉపయోగపడతాయని వైద్యులు సూచిస్తుండడంతో గిరాకీ పెరిగింది.


ఎండకు నిర్మానుష్యంగా మారిన కొండాపూర్ యాప చౌరస్తా

వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నీరు, పండ్ల రసాలు, కొబ్బరినీరు, మజ్జిగ , ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- నలుపురంగు, మందంగా ఉండే దుస్తులకు బదులు లేత రంగుల్లో తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి.
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలి.
- పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి.
- అత్యవసర సమయంలో ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ పట్టుకుని వెళ్లాలి.
- వీలైతే ఉదయం,సాయంత్రం వేళల్లో పనులు చూసుకోవాలి.

ఎండకు చేయకూడని పనులు

- ఎక్కువ ఎండ ఉన్న సమయంలో ఎండలో తిరగవద్దు.
- రోడ్ల వెంట విక్రయించే చల్లని రంగు పానీయాలు తాగరాదు.
- రోడ్లమీద అమ్మే ఆహారం తినవద్దు.
- మాంసాహారం బదులు కూరగాయల ఆహారం తినాలి.
- ఎండలకు మద్యం సేవించరాదు.

వడదెబ్బ తగిలితే ఆసుపత్రికి తరలించాలి
రవికిరణ్, కాసిపేట మెడికల్ ఆఫీసర్



వడదెబ్బ బారిన పడిన వ్యక్తిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి. నీడ ఉండే ప్రదేశానికి చేర్చి తడి గుడ్డతో శరీరమంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు తుడవాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, లేదా గ్లూకోజ్ ద్రావణం లేదా ఓఆర్ఎస్ తాగించాలి. వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు నీరు తాగించకూడదు. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి. పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఎండలో తిరగవద్దు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి


దేవాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కాసిపేట, మార్చి 26: పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ అధికారులకు సూచించారు. మంగళవారం దేవాపూర్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో దేవాపూర్‌లోని డీఏవీ పాఠశాల పోలింగ్ కేంద్రంలో వెలుతురు లేక ఓటర్లు ఇబ్బందులు పడ్డారని, వెలుతురు సరిగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, నీడ, మూత్రశాలలు ఉండేలా చూడాలన్నారు. అనంతరం గ్రంథాలయాన్ని పరిశీలించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు, గర్భిణీలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, సకాలంలో కేంద్రాలను తెరవాలన్నారు. తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో నాగరాజు, కార్యదర్శి కవిత , సౌందర్య తదితరులు ఉన్నారు.

బూత్ స్థాయి అధికారులతో సమావేశం

నస్పూర్, మార్చి 26: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీసీసీలోని సింగరేణి అతిథి గృహం కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నస్పూర్ మండల బూత్ స్థాయి అధికారుల సమావేశం జరిగింది. తహసీల్దార్ శ్రీనివాస్ బూత్ స్థాయి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల విధి విధానాలను తహసీల్దార్ వివరించారు. ఆర్ఐలు మాంతయ్య, చందర్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన

లక్సెట్టిపేటరూరల్, మార్చి 26: మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల విధులపై తహసీల్దార్ రాఘవేంద్రరావు అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధుల గురించి వివరించారు. ఎంపీడీవో సరోజ, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, అధికారులు మధుసూదన్, చైతన్య, మానిక్‌రావు, గౌతం, రామ్మోహన్, సతీష్‌కుమార్, సమ్మక్క, జీవన్‌రెడ్డినవీత్ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ సంస్థకు ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

నస్పూర్, మార్చి 26: రాంనగర్‌లోని ఆదిత్య హై స్కూల్ విద్యార్థులు విరాళాలు సేకరించి గోదావరిఖనిలోని బాలల సంరక్షణ సంస్థకు రూ.12,099 విరాళంగా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పని తిరుపతి తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదును సంస్థ ప్రతినిధులకు ఇచ్చినట్లు తెలిపారు. పిల్లలు, ఉపాధ్యాయులు కలిసి విరాళాలు సేకరించినట్లు పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులతో పాటు పాఠశాల డైరెక్టర్ సాయికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థి ప్రతిభ


కాంస్య పతకంతో రవికిరణ్

చెన్నూరు, మార్చి 26: అంతర్జాతీయ పార అథ్లెటిక్స్ పోటీల్లో కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆసరెల్లి రవి కిరణ్ కాంస్య పతకం సాధించాడు. ఈ నెల 25 నుంచి 26 వరకు బెంగుళూరులోని కంటీరవ స్టేడియంలో జరిగిన 6వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎఫ్ 37 క్యాట గిరిలో డిస్కస్ త్రో ఈవెంట్‌లో 30 మీటర్ల దూరం విసిరి కాంస్యం పతకం సాధించాడు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు అభినందించారు.

ఆయుధాలు సరెండర్ చేయాలి

ఏసీసీ, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని లైసెన్స్ కలిగిన తుపాకులను సరెండర్ చేయాలని పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో ఆయుధాల చట్టం 1959 సెక్షన్ 21 ప్రకారం కమిషనరేట్ పరిధిలో నివసిస్తూ లైసెన్స్ తుపాకులు కలిగిన వారందరు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లలో డిపాజిట్ చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా ముందస్తుగా ఆయుధాలు పోలీస్‌స్టేషన్‌లలో డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం జూన్ 7న ఆయుధాలు తీసుకోవచ్చన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

కోటపల్లి, మార్చి 26: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను మంగళవారం జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.సత్యనారాయణమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా అకాడమిక్, ఒకేషనల్‌కు సంబంధించిన పలు రికార్డులు, పరికరాలు పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల వారీగా పలు అంశాలపై బోధిస్తూ వారి సామర్థ్యాలను అంచనా వేశారు. వారంలో కనీసం మూడు పీరియడ్‌లు ఒకేషనల్‌కు కేటాయించాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హరికృష్ణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

దండేపల్లి, మార్చి 26: తాళ్లపేట గ్రామానికి చెందిన సిద్దం పుల్లయ్య(75) అనే వృద్ధుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం ఇంటి సమీపంలో ఉన్న పెరడులో చెట్లకు నీళ్లు పట్టేందుకు మోటార్ ఆన్ చేశాడు. విద్యుత్ సరఫరా జరిగి షాక్‌కు గురికావడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మృతుడి కుమారుడు సిద్దం లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ వెల్లడించారు.

మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 26: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ మొదటి దశను పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల శాసనసభ నియోజకవర్గాల్లో 1,131 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1111 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2187 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు మొత్తం 4,429 మంది సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. సిబ్బందికి ఎస్ఎంఎస్‌తోపాటు సంబంధిత ఉత్త ర్వులను అందిస్తామని తెలిపారు. విధులను సమ ర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ సునీల్, ఎన్ని కల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ రూపొందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 26: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలని, వేసవి అయినందున తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. గన్ని సంచులు, టార్పా లిన్‌లు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, డీఆర్‌డీవో కిషన్, పౌరస రఫరా శాఖ అధికారి వాజిద్, మేనేజర్ గోపాల్, మార్కెటింగ్ అధికారి గజానంద్ పాల్గొన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యేలు



మంచిర్యాల, మార్చి 26: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం డిల్లీలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణను ప్రకటించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ ఉన్నారు.

ఇరవై ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి చేసింది శూన్యం


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఏసీసీ, మార్చి 26: మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు 20 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గానికి చేసింది శూన్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ అధ్యక్షుడు పూదరి తిరుపతిలు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పనిచేసిన దివాకర్‌రావు వైఫల్యాలు, ప్రేంసాగర్‌రావు చేసిన సేవలు కాంగ్రెస్ పార్టీ విజయానికి కారణమయ్యాయన్నారు. దివాకర్‌రావుకు స్వార్థ ప్రయోజనాలే పరమావధి అని ప్రజా సంక్షేమం అభివృద్ధిపై ఎన్నడు శ్రద్ధ లేదన్నారు. అభివృద్ధి సంక్షేమాన్ని విస్మరించడం వల్లనే ప్రజలు దివాకర్‌రావును చిత్తుగా ఓడిం చారన్నారు. ప్రేంసాగర్‌రావు ఎమ్మె ల్యేగా గెలిచిన వంద రోజుల్లోనే నియోజకవర్గానికి రూ.200 కోట్లకు పైగా నిధులు తెచ్చి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ఎమ్మెల్యే పాటు పడుతున్నారన్నారు. వేములపల్లి సంజీవ్, వసుంధర, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు వాడితే చర్యలు తప్పవు


జరిమానా రశీదు ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

నస్పూర్, మార్చి 26 : మున్సిపల్ పరిధిలో మంగళవారం మున్సిపల్ సిబ్బంది పలు కిరాణ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానాలు వేశారు. నిబంధనలకు విరుద్ధంగా కవర్లను వాడుతున్న ఫ్లడ్ కాలనీలోని సూపర్ మార్కెట్ యజమాని రమేష్‌కు వేయి రూపాయల జరిమానా వేశారు. అనంతరం పలువురు వ్యాపారులకు మున్సిపల్ కార్యాలయంలో పాలిథిన్ కవర్ల వినియోగంపై కమిషనర్ చిట్యాల సతీష్ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడుతున్న వారికి ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2016 ద్వారా జరిమానాలు వేస్తామన్నారు. పట్టణంలోని వ్యాపారులు సహకరించాలని కోరారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, జూనియర్ అసిస్టెంట్ పవన్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

మందమర్రిరూరల్, మార్చి 26 : సారంగపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీవో రజియా సుల్తానా మంగళవారం పరిశీలించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు జాగ్రత్తగా ఉండాలని, వెంట నీరు తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల లోపు పనులు పూర్తయ్యేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ తిరుమల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం


జడ్పీ బాలుర పాఠశాల మైదానంలో వాకర్లతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

ఏసీసీ, మార్చి 26: అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల, జడ్పీ బాలుర పాఠశాల మైదానంలో, మార్కెట్ చౌరస్తా, ఓవర్‌బ్రిడ్జి వద్ద లేబర్ వర్కర్లను కలిసి ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. యువ నాయకుడు విజిత్‌రావు, సత్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

కన్నెపల్లి, మార్చి 26: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. టేకులపల్లి నుంచి ఇసుకతో జజ్జరవెల్లికి ఇసుక, మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. సత్రవేని బాపు, పడుగురి రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.